'రచన' మాసపత్రిక - ఆగస్టు, 1994

# బందీ

మృతవీరుల స్మారక సభ జరుగుతోందక్కడ.

అక్కడంతా ఎరుపు. ఎరుపు. శ్రీకాకుళ నక్సల్‌బరి పోరాటాల్లో అసువులు బాసిన అమరజీవులకు శ్రద్ధాంజలి.

కిక్కిరిసిన జనం! జనం!

ఇలాంటి సభలకి యింతమంది వస్తారా?

వచ్చారు. అది వాస్తవం. లారీలపై మోసుకురాబడ్డ వాళ్ళు మాత్రం కాదు. యువతరం అంతా అక్కడే వుంది.

అక్కడ ఒక వృద్ధుడు కూడా ఉన్నాడు. అతడు అరవయ్యేళ్ళకే ఎనభయ్యేళ్ళు ముంచికొచ్చిన వాడిలా ఉన్నాడు. రోగంతో, రొప్పుతో రేపో మాపో కాటికి పోయేవాడిలా వున్నాడు. అతడెవరో కాదు - నేనే!

వేదిక మీద మంత్రులు లేరు. అధికారులు లేరు. గవర్నమెంటు కవులు లేరు. కుర్చీలు లేవు. టేబుల్ కూడా లేదు. దండలు అసలు లేవు. మైక్ మాత్రమే ఉంది.

సభను నిర్వహిస్తున్నతను కూడా అవసరమైనప్పుడే వేదిక ఎక్కి మైక్ వద్దకు వెళ్ళి తర్వాత కార్యక్రమం చెప్పి ఆ వెంటనే దిగిపోతున్నాడు. ఒకరి తర్వాత ఒకరు వేదికపైకి వెళ్ళి పది నిముషాలు - పావుగంట ఉపన్యాసాలు వినిపిస్తున్నారు.

ఈ ముసలి ప్రాణం, అక్కడ అరగంట కన్నా ఎక్కువ ఉండలేక లేచింది. నాలుగడుగులు బయటకు వేసింది.

అంతలో -

వేదిక పై నుంచి ఒక యువకుని గొంతు మలయమారుతంలా నన్ను తాకింది. ఏ తియ్యని లోకాల నుంచో, ఏ స్వర్గపుటంచుల నుంచో మధురమైన పారవశ్యాన్ని మోసుకొచ్చింది.

ఆ స్వరానికి నాపై సర్వహక్కులు ఉన్నట్టు - మరో అడుగు నేను ముందుకు వేయకుండా ఆపింది.

వెనుతిరిగి వేదిక వైపు దృష్టి సారించేను.

ముప్పయ్యేళ్ళ ఒక యువకుడు ఉపన్యసిస్తున్నాడు.

అతణ్ణి చూసి చకితుడనయ్యేను. నిర్ఘాంతపోయేను.

నా కళ్ళు నన్ను మోసగించడం లేదు కదా!

నాలో సన్నగా ఒణుకు ప్రారంభమయింది. నా గుండె దడ దడ లాడింది. చూపు మసకవుతోంది.

జనాన్ని తోసుకుంటూ ముందుకు వెళ్ళేను.

దగ్గర నుంచి చూసేను.

ఆ యువకుడు బలంగా వున్నాడు. పొడవుగా ఉన్నాడు. తెల్లగా వున్నాడు. ఉంగరాల జుట్టు, పెంచిన మీసం. గీయని గెడ్డం. చురుకైన పెద్ద కళ్ళు. తెల్లటి కుర్తా, పైజామాలో గంభీరంగా ఉన్నాడు. అంతే గంభీరంగా ఉపన్యసిస్తున్నాడు.

నా ఆనందానికి అవధులు లేవు.

ఎదురయిన - ఆడబోయిన తీర్థం.

కాలికి తగిలిన - వెదుకబోయిన తీగ.

ఆ విగ్రహం, ఆ రంగూ, ఆ స్వరం... ముమ్మార్తులా నా రవిబాబే!

ఇదేదో ఇంద్రజాలం.

పదేళ్ళ నిరీక్షణ.

దేవుడు నా మొర విన్నాడు.

నా బిడ్డ నాకు దొరికేడు.

ఇంతటి ఆనందాన్ని పంచుకోవడానికి వాడి తల్లి - అయ్యో! బతికి లేదు. తోడబుట్టిన వాళ్ళు లేరు. బంధువులు లేరు. ఆప్తులు లేరు. ఆత్మీయులు లేరు. స్నేహితులు కూడా లేరు.

మొత్తం ఆనందాన్ని నేనొక్కణ్ణే భరించి జీర్ణించుకోవాలి. మహా ప్రసాదం.

అదృష్టం నాదే!

కళ్ళల్లో నీళ్ళు తుడుచుకుంటే నా కొడుకు కనిపించే దృశ్యం అదృశ్యమవుతుందేమోనని, చివరికి భ్రమే మిగులుతుందేమోనని కళ్ళు తుడుచుకోలేదు.

ఈ మధ్య నా చూపు బాగా దెబ్బతింది. అద్దాలు లేకుంటే ఏదీ కనిపించనే కనిపించదు. అడుగు ముందుకు పడదు.

గత కొన్నేళ్ళుగా నా రవిబాబు కోసం అదే పనిగా, తీవ్రంగా, పట్టుదలగా, ఎవరి సాయం లేకుండా నేనొక్కణ్ణే గాలిస్తుండడం చేతే, నాలో అణువణువు వాడి స్మృతులతో క్షణక్షణం పరితపిస్తూ పిచ్చివాడిలా తిరుగుతుండడం చేతే - నా కంటికి ఆరేళ్ళ బాలుడు నుంచి ముప్ఫయ్యేళ్ళ యువకులంతా నా రవిబాబులానే కనిపిస్తున్నారు. నా బాబే అనుకొని ఇద్దరు ముగ్గురుని పలకరించి భంగపడ్డాను కూడా.

ఆ యువకుడు మాత్రం నా రవిబాబే! ఇది భ్రమ కాదు. కావడానికి వీల్లేదు.

నాకు చావు సమీపించింది. అది వాస్తవం. నేను పోయేలోగా - నా రవిబాబు కన్పిస్తాడని, నా దగ్గరకు తప్పక వస్తాడనీ నా కెందుకో మనసులో బలంగా, ధృడంగా నమ్మకం

ఏర్పడిపోయింది.

ఇలాంటి సభల వద్ద నా రవిబాబు తప్పక కనిపించవచ్చని ఆశతో వచ్చేను. నా ఆశ దురాశ కాదు. నా ఆశ నిరాశ కాలేదు.

నా రవిబాబు నాకు కనిపించాడు. వాడు వేదిక దిగేవరకూ ఆగాలనిపించలేదు. పరుగున వెళ్ళి వాడిని వాటేసుకోవాలనిపించింది.

రవిబాబు ఉపన్యాసం మొదట నిదానంగా నదిలా సాగి.... ఉరుకుల పరుగుల సెలయేరుగా మారి...తుపానులా చెలరేగి ... పెను ఉప్పెనలా ముగిసింది.

చప్పట్లు.. చప్పట్లు... నేనూ తనివి తీరా చప్పట్లు కొట్టేను.

ఇక్కడొక విషయం. నేను వాళ్ళ హింసతో కూడిన సిద్ధాంతాలతో ఏకీభవించను. అయితే వాళ్ళు నిజమైన దేశభక్తులని నమ్ముతాను. త్యాగనిరతి... పీడిత ప్రజల విముక్తి కోసం ప్రాణాలు సైతం లెక్కచేయని వాళ్ళ త్యాగనిరతి నన్ను అబ్బురపరుస్తుంది. అకుంఠిత దీక్ష - జయాపజయాలని లెక్కచేయని వాళ్ళ అకుంఠిత దీక్ష నన్ను ముగ్ధుణ్ణి చేస్తుంది.

"వీరుల కెప్పుడూ చావు లేదు. వాళ్ళు చిందించిన ప్రతి రక్తపు బొట్టులోంచి మరో వీరుడు ఉద్భవిస్తాడు. పోరాటంలో ఆశువులు బాసిన మహావీరులందరూ మనలో, మన రక్తంలో ఉన్నారు. మనల్ని మేల్కొలుపుతూ నిత్యనూతన చైతన్యవంతులుగా చేస్తుంటారు. ఆ మహనీయుల అపురూప త్యాగాలను గుర్తుచేసుకొని వాళ్ళ మార్గంలో మనం పయనించడమే ఈ స్మారక సభల లక్ష్యం" అని చెబుతూ ఉపన్యాసం ముగించేడు.

చప్పట్లు మధ్య వేదిక దిగిపోయేడు.

మరో యువకుడు వేదిక ఎక్కాడు. 'నేను చెప్పాల్సింది ఏమీ లేదు. నేను చెప్పాలనుకున్నదంతా కామ్రేడ్ భాస్కర్ చెప్పేశా'డన్నాడు. తర్వాత అతను మాటాడేది నాకు వినబడలేదు.

పేరు భాస్కర్ ఏమిటి? వాడు ఏ భాస్కరుడూ కాదు. నా రవిబాబు. ముమ్మాటికీ నా రవిబాబు. నా మనసు తిరగబడింది.

నాకు తెలుసు. వీళ్ళు అసలు పేరుతో సాధారణంగా బయటకు రారు. అన్నీ దొంగ పేర్లు. అయినా రవి ఏమిటి? భాస్కర్ ఏమిటి? ఇద్దరూ ఒక్కడే. నా కొడుకు పేరు రవిబాబు. నా కొడుకు పేరు భాస్కర్.

భాస్కర్ మామూలుగానే జనంలోకి వచ్చి నించొని తనూ ఒక శ్రోత అయిపోయేడు.

నా కళ్ళు రవిబాబు అలియాస్ భాస్కర్‌ని వెంబడిస్తున్నాయి.

నేను అందర్నీ తోసుకుంటూ అతని దగ్గరికి వెళ్ళేను. ఇంకా దగ్గరికి వెళ్ళేను.

కళ్ళద్దాలు తీసి రుమాలుతో కళ్ళు తుడుచుకున్నాను. అద్దాలు తుడిచేను. బాబుని పరీక్షగా చూసేను.

కొడుకు ఎంత చిక్కిపోయేడు. అడవిలో నా బాబుకి ఆలనా పాలనా ఏది? తిండి తిప్పలు

ఏవి?

నన్ను చూసి 'నాన్నా' అని పలకరిస్తాడేమోనని ఆశతో చూసేను. పట్టించుకోలేదు. తాకేను. నా వొళ్ళు రోదసీలోకి వెళిపోయింది. కాని వాడిలో ఏ చలనమూ లేదు. దగ్గేను. నా వైపు చూసేడు. నా సర్వేంద్రియాలు వాడి పిలుపుకి తహతహలాడేయి. వజవజ వణుకుతున్న నా శరీరం గుండెలకి హత్తుకోవాలని జివజివ లాడింది.

కాని వాడు ఒక్క క్షణం నా వైపు చూసి, ఏమీ కానట్టే, నేనెవరో తెలీనట్టే ఏ స్పందనా లేకుండా నిర్దయగా చూపులు వేదిక వైపు తిప్పేశాడు. నాకు గుండెల్ని పిండినట్టయి పోయింది.

'ఒరే నీదెంత రాతి గుండెరా! మీ పార్టీలో కర్కశత్వంతో పాటు కపట నటన కూడా నేర్పుతారేట్రా – అని లెంపలు వేసి అడగాలనిపించింది. పేరు మార్చుకొని, గెడ్డం పెంచినంత మాత్రాన నీవు నా కొడుకువి కాకుండా పోతావా?

'పదేళ్ళ కిందట నన్ను వదిలి వెళ్ళిపోయినప్పుడు నీవు నా కొడుకువి కాదనుకున్నాను. కాదనుకున్నా కొడుకువి కాకుండా పోవు. అందుకే వచ్చేను. నీవు మాత్రం తండ్రిని కాదనుకోగలిగేవు. కాదని ఎలా మనగలవో అదీ చూస్తాను.

'నేను నిన్ను వదలను. నీచేత 'నాన్నా' అని పిలిపించుకోకుంటే – నేను నీకు జన్మనిచ్చిన తండ్రినే కాదు. చూస్తాను' – పైకే ఉబికాయి అనుకుంటాను నా మాటలు.

వాడు నంగనాచిలా "ఏమిటంటున్నారు?" అన్నారు.

"ఏమిటో నీకు తెల్సు" అన్నాను.

నన్నే పిచ్చివాడి కింద జమకట్టి నా నుంచి విడిపోయి దూరంగా మరోచోట నించున్నాడు.

రక్త సంబంధం దాస్తే దాగదు. నీవు కాదనుకుంటే పోదు.

నా రవిబాబు నా నుంచి మరుగు కాలేదు. ఈ స్మారక సభ నాకు ఒక స్మారక స్మృతిగా మిగిలిపోవడానికి వీల్లేదు.

నేను వాడిని వదలను.

సభ ముగిసింది. భాస్కర్ నలుగురు స్నేహితులతో కదిలేడు.

నేను వెనుకే ఫాలో అయ్యేను.

భాస్కర్ స్నేహితులు నల్గురల్లా ముగ్గురు, ముగ్గురల్లా ఇద్దరు, ఇద్దరల్లా ఒక్కరు అయ్యే వరకూ.. నేను ఫాలో అవుతూనే వున్నాను.

స్నేహితుడికి గుడ్‌నైట్ చెబుతూ నన్ను చూసేడులా వుంది. ఒక్క క్షణం ఆగేడు. నేనూ ఆగేను. ముందుకు కదిలేడు. నేనూ కదిలేను. కొంత దూరం సాగి ఒక పెంకుటింట్లో దూరేడు.

నాకేం చేయాలో తోచలేదు. ఆ యింటి కెదురుగా మదుం ఉంది. అక్కడ కూర్చున్నాను. చాలాసేపు కూర్చున్నాను.

బైటకి ఒకసారి వచ్చేడు లుంగీతో.

నన్ను చూసీ చూడనట్టు దొంగాటకం ఆడుతున్నాడు.

ఇన్నాళ్ళు వాడు స్వేచ్ఛగా ఉన్నాడు. నేను రావడంతో ఇరకాటంలో పడ్డాడు. ఏమి చేయాలో దిక్కుతోచని వాడై నాతో దాగుడు మూతలాడుతున్నాడు.

వాడు ఎప్పుడూ అంతే! వాడి బాల్యంలో కూడా పిల్లలతో కాకుండా నాతోనే ఎక్కువగా ఆటలు ఆడేవాడు. అప్పుడు మేము కంపెనీ క్వార్టర్సులో ఉండేవాళ్ళం. అక్కడ వాడి సైజు పిల్లలు ఎవరూ లేకపోవడం చేత - సాయంత్రం స్కూలు నుంచి రాగానే వాడికి ఏమీ తోచేది కాదు. పిచ్చెక్కినట్టుండేది. అది ఎంత భయంకరమైన స్థితో నాకు అర్థమయింది. బాబు దిగులు ముఖం చూడలేకపోయేడు. నేను సాయంత్రాలు పూర్తిగా వాడికే స్పేర్ చేయడం మొదలు పెట్టాను. వాడితో బాటు చిన్నకుర్రవాడిలా ఆటల్లో పాల్గొని సంతోష పెట్టేవాడిని.

వాడు గార్డెన్‌లో దాగుంటే... నేను చాలాసేపు వాడిని వెదికినట్టు నటించి... చివరికి 'అమ్మ దొంగా!' అని పట్టుకుంటే - పకపకమని నవ్వేవాడు. ఇప్పటికీ ఆ చిన్నారి ముఖంలో నవ్వు - నిన్న మొన్న దృశ్యంగా గుర్తుకొచ్చి పరమానందభరితమై బాధిస్తుంది.

క్రికెట్, షెటిల్ కాక్, ఫుట్‌బాల్, కబాడీ.. ఏదో ఆట రోజూ ఆడాలి. మేమిద్దరమే ప్లేయర్స్. ప్రతి ఆటలో నేను తప్పనిసరిగా ఓడిపోవాలి. లేకుంటే పేచీ పెట్టి ఏడ్చేసేవాడు. వాడి అల్లరి అంతా ఇంతా కాదు.

చిత్రమేమిటంటే వాడి తల్లి నాపై విసుక్కునేది. అలిగేది. మూలిగేది. నేను ఎక్కువ సమయం కుర్రవాడికే కేటాయించడం ఆమెకి నచ్చేది కాదు. నేను ఆమెకు నచ్చజెప్పేవాడిని.

నా రవిబాబే నాకు ప్రపంచం.

ముందు కొడుకు, తర్వాతే భార్య!

రవిబాబు ఎదురుగా - నా కెదురుగా వరండాలో కూర్చున్నాడు.

ఇద్దరి మధ్యా ఇరవై అడుగుల దూరం.

ఇద్దరి మధ్యా నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ బస్సులూ, లారీలూ, ఆటోలు స్కూటర్లూ దూసుకుపోతున్నాయి.

వాడు వరండా లైటులో పుస్తకం చదువుతున్నట్టు... అంతా నటన... చూపంతా నా వైపే....

నేను వాడినలా చూస్తూ... గంటల తరబడి ఉండిపోగలను. వాడు నా ముందుంటే ఆకలి, నిద్ర నాకు ఆమడ దూరంలోఉంటాయి.

రవిబాబు నాకు అంత దూరంలో ఉన్నప్పటికీ నా ఊహ హస్తాలు వాడి తలనీ, చెక్కిళ్ళనీ, గెడ్డాన్నీ, దేహాన్నీ ఆప్యాయంగా నిమురుతున్నాయి. ఆర్తిగా, ఆబగా వాడి శరీరాన్ని హత్తుకొని మధురమైన పారవశ్యాన్ని ఆస్వాదిస్తోంది నా హృదయం.

రాత్రి పన్నెండు అవుతోంది.

లైట్ ఆర్పేశాడులా ఉంది. ఎదురుగా అంతా చీకటి.

చీకటితో నాకు పని లేదు.

కిర్రుమని తలుపులు వేసుకున్న చప్పుడు.

ఆ చప్పుడు - నన్ను వదిలేయి తండ్రీ అని వేడుకోలు.

నాకు తృప్తిగా వుంది.

ఈ రోజుకి వాడికిచ్చిన డోస్ చాలు.

లేచి నించున్నాను. ఇంటికి కదిలేను.

నడుస్తూ వెనక్కి చూసేను.

లైటు వేసి వుంది.

భాస్కర్ బయటకి వచ్చి నించున్నాడు. నన్ను చూస్తున్నాడు.

నాకు గర్వం కలిగింది.

గబగబా అడుగులు వేసుకుంటూ ముందుకు పోయేను. అరగంటలో ఇంటికి పోయేను. ఇంటికెళితే ఏముంది?

వెలిసిన గోడలు, చీకటి నీడలు. భయంకర నిశ్శబ్దం. కావలించుకున్న దుర్భరమైన ఒంటరితనం.

నన్ను నీరసం పూర్తిగా ఆవహించింది. నీరసం వచ్చినప్పుడల్లా గుండె నా మాట వినదు. రెండు మాత్రలు మింగి, రెండు గ్లాసులు నీళ్ళు తాగి నడుం వాల్చేను.

మంచంపై అటు ఇటు దొర్లుతున్నాను.

నిద్ర పట్టడంలేదు.

తెరలు తెరలుగా రవిబాబు జ్ఞాపకాలు.

అలలు అలలుగా అలనాటి తీపి గుర్తులు. చెడు మరకలు.

రవిబాబు ఆటల్లో ఎంత అల్లరో - చదువులో అంత ముందు ఉండేవాడు. ఒక్కగానొక్క కొడుకు వాడు. ఎన్నో నోములు నోస్తే, మరెన్నో పూజలూ, వ్రతాలూ చేస్తే మా కడుపున పడ్డవాడు. పెళ్ళి అయిన పదేళ్ళకి - లేక లేక కలిగిన సంతానం వాడు. వాడి తర్వాత మరి పిల్లలు లేరు. లేరని బాధ లేదు.

సూర్యుడొక్కడే ఉంటాడు. మొత్తం ప్రపంచానికి వెలుగు నిస్తాడు.

మా వెలుగు రవి. మా ప్రపంచం రవి.

సాధారణంగా పిల్లలు తల్లికి చేరువవుతారు.

అసాధారణంగా రవిబాబు నాకు చేరువయ్యేడు. నా తర్వాతే తల్లి. తల్లిని కాదని నా దగ్గరే చేరిక. తల్లి పాలు తాగి పెరగలేదు. డబ్బా పాలు తప్పలేదు. రాత్రులు పాలు కలిపి నేనే పట్టి, నా పక్కలో పడుకోబెట్టుకునేవాణ్ణి. ఉదయానికి పూర్తిగా నా పంచె, నా పక్క పూర్తిగా తడిపేసేవాడు. అది వాడు నా పై కురిపించే ప్రేమ. అందరూ వాడిని, 'అమ్మ కూచి కాదు నాన్న కూచి' అనేవారు.

కథా నిలయం శ్రీకాకుళం

ఇంటి దగ్గర నేను లేనప్పుడు తల్లిని తెగ అల్లరి పెట్టేవాడు. నేను డ్యూటీ నుంచి సాయంత్రం వచ్చే సమయానికి వాడు ద్వారం వద్ద నా కోసం ఎదురుచూస్తూండేవాడు. నేను ఎన్ని పనులున్నా చూసుకొని వాడి కోసం పరుగున వచ్చేవాణ్ణి.

సాయంత్రం అంతా వాడితోనే ఆట.

రాత్రి నేను చదువుకుంటున్నా, ఎవరితో మాటాడుతున్నా, నిద్రపోతున్నా ఏ సమయంలోనైనా సరే – నన్ను డిస్టర్బ్ చేయడానికి వెనుకంజ వేసేవాడు కాదు. అల్లరే అల్లరి.

మనిషి ఎదిగి, గొంతు మారి, నూనూగు మీసాలు వచ్చేసరికి, కాలేజీలో చేరేసరికి వాడిలో అల్లరి మటుమాయమయింది. గంభీరత చోటుచేసుకుంది. వాడు ఒక్కసారిగా పెద్దవాడై పోయేడు అనిపించింది.

నన్ను హత్తుకోవడం మానేశాడు. పడుకునేటప్పుడు నా దగ్గరకు వచ్చి ముద్దుపెట్టుకునే అలవాటు మానేశాడు. నేనే ఉండలేక వాడు నిద్రపోతున్నప్పుడు వాడి గదిలోకి వెళ్ళి నుదురుపై ముద్దు పెట్టుకునేవాడిని.

తర్వాత్తర్వాత నాకు అలా ముద్దుపెట్టుకునే అవకాశం కూడా చిక్కలేదు. రాత్రంతా ఏవేవో పుస్తకాలు చదువుతూ ఉండేవాడు. నిద్రపొమ్మన్నా పోయేవాడు కాదు.

మెడికల్ కాలేజీలో చేరిన మూడేళ్ళలో .... వాడు నాకు కాకుండా పోతున్నాడనేది అర్థమవసాగింది. విద్యార్థుల ఉద్యమాలే కాకుండా ప్రభుత్వ నిర్ణయాలకి వ్యతిరేకంగా రాడికల్స్ జరిపే ఉద్యమాలలోనూ పాల్గొనేవాడు.

కాలేజీ ప్రిన్సిపాల్ నుంచి ఉత్తరాలపై ఉత్తరాలు.

రవిబాబుతో నాకు ఘర్షణ.

వాడు చెప్పే ఆర్గుమెంట్‌లో అవతల సంస్థ యొక్క లేదా అవతల వ్యక్తి యొక్క అన్యాయం, అధర్మం, ప్రస్ఫుటంగా కనిపించేవి. దానిపై వాళ్ళ ఉద్యమం, యుద్ధం సమంజసంగానే తోచేది. ఆ విషయంలో నేను వాడితో వాదించలేకపోయేవాడిని. అయితే నేను ఎన్నో ఆశలు పెట్టుకున్న నా కొడుకు ఆ ఉద్యమాలలో పాల్గొనడాన్ని సహించలేక పోయేవాడిని.

'నీకు రాజకీయాలు వద్దు. నా మాట విని చదువుకో. ఈ వయసులో చదువే నీ ధ్యేయం' అని నచ్చజెప్పేను. బతిమాలేను. శాసించేను.

'ఇవేం చదువులు?' అనే ప్రమాదకరమైన పరిస్థితికి వచ్చేశాడు. జీవితంలో పండిపోయిన నాకు పాఠాలు చెప్పడం ప్రారంభించేడు.

నిన్న మొన్నటి వరకూ ఎన్నో ప్రశ్నలకీ, సందేహాలకీ, సంశయాలకీ... నన్ను వేధించి, మథించి నా నుంచి జవాబులు పొందిన నా కొడుకు నాకే జవాబులు చెప్పి ఉపన్యాసాలు ఇవ్వడం మొదలు పెట్టాడు. వాడు మాట్లాడిందే ధర్మం. న్యాయం. సత్యం. నిర్మొహమాటంగా, నిస్సంకోచంగా, నిర్భయంగా నా అభిప్రాయాలను ఈసడించి తీసి పారేసేవాడు. రాజకీయ,

సాంఘిక, ఆర్థిక, సాంస్కృతిక.. ఏ రంగంలోనైనా సరే ప్రపంచం గురించి నాకేం తెలియనట్టు, అంతా వాడికే తెలుసన్నట్టు ఒక సుస్థిరమైన ఆత్మవిశ్వాసంతో నన్ను నిలువునా పడగొట్టేవాడు. వాడి గొంతులో ధిక్కారం. మాటలో స్పష్టత. చెప్పడంలో సూటితనం.

ఇంతగా ఎప్పుడు ఎదిగి పోయేడు? అంతటి జ్ఞానం ఎలా వచ్చింది?

నా ఒక్కగానొక్క కొడుకు బుద్ధిగా చదువుకొని డాక్టరవుతాడనుకున్నాను. ఇలా రాడికల్ అవుతాడనుకోలేదు.

ఒకసారి పోలీస్ లాకప్‌లో రెండు రోజులు వాడు ఉండిపోతే నేనూ, వాడి తల్లి ఎంత తల్లడిల్లిపోయేమో వాడికేం తెల్సు? ఆ తర్వాత -

ఒకరోజు చెప్పా చేయకుండా ఇల్లు విడిచి వెళ్ళిపోయేడు. క్రూరంగా, కర్కశంగా, నిరంకుశంగా, నిర్దయగా మమ్మల్ని విడిచి వెళ్ళిపోయేడు.

ఎందుకు వెళ్ళిపోయిందీ ఒక ఉత్తరం రాశాడు. చదివి వెంటనే ఉత్తరాన్ని చింపేయమన్నాడు. మళ్ళీ ఉత్తరం లేదు. మనిషి లేదు. కబురు లేదు.

వాడు లేని లోటు మేం తట్టుకోలేక పోతుంటే -

మరోవైపు పోలీసుల వేధింపులు. ఇంటిపై దాడులు.

వాడు ఎక్కడున్నాడో చెప్పమంటారు. మాకేం తెలుసు? తెలిస్తే మేమే పరిగెట్టేవాళ్ళం. కాని పోలీసులు నమ్మరు.

ఇల్లంతా చిందర వందర చేశారు. నన్ను, వాడి తల్లి లక్ష్మిని ప్రశ్నలతో చిత్రవధ చేశారు.

చివరికి వాడి ఫోటో అడిగేరు. రవిబాబు వాడి ఫోటోయే కాదు వాడికి సంబంధించిన దస్తూరీతో సహా ఏమీ కూడా ఇంట్లో లేకుండా జాగర్తలతో వెళిపోయేడు. ఫోటో మాకే లేదు. పోలీసులకేం ఇవ్వగలం?

వాడు ఫోటో, వాడి వస్తువులతో బాటు మా గుండెలు గునపంతో తవ్వి వాడి జ్ఞాపకాలను కూడా తీసుకుపోయుంటే బాగుండేది కొడుకు.

మాకు కొడుకు పుట్టనే లేదు. పుట్టినా పురిట్లోనే చచ్చిపోయేడు - అని ఎంత గుండె రాయి చేసుకున్నా వాడి జ్ఞాపకాలు మమ్మల్ని వేధించేవి.

ఆ యిల్లు, ఆ పరిసరాలకు అతిదూరంగా ఎక్కడికో పోతే వాడి జ్ఞాపకాల వేధింపులు, పోలీసుల వేధింపులు తప్పుతాయి. మనశ్శాంతి చిక్కుతుందనే ఆశతో - చాలా దూరం - మరో వూరుకి వెళ్ళిపోయేం.

మేము ఊరు మారినా, దూరం వెళ్ళినా వాడి జ్ఞాపకాలు మమ్మల్ని వదలలేదు. వెంటాడి వేధించేవి. కన్న పేగుల్ని కొరికి బాధించేవి. గుండెల్ని మండించి దహించేవి.

వాడు లేని లోటు భరించలేక ఆత్మహత్య చేసుకోవాలనిపించేది.

ఇంతలో -

అందులోంచి బయటపడే మార్గం లభించింది. అది రిజిష్టర్డ్ ఉత్తరం.

నేను పనిచేస్తున్న కంపెనీ నుంచి వచ్చింది. ఇన్నాళ్ళు ఉద్యోగానికి సరిగా హాజరు కాకపోవడం చేత కంపెనీవారు పంపిన ఛార్జి మెమో. ముందుగా కంపెనీ అనుమతి లేకుండా, లీవ్ గ్రాంట్ చేయించుకోకుండా - డ్యూటీ మానేయడాన్ని గర్హిస్తూ, ఇక మీదట సరిగా డ్యూటీకి రాకుంటే ఉద్యోగం ఊడుతుందని హెచ్చరిక.

ఆ కాగితాన్ని చించేద్దామనుకున్నాను. నా ఉద్యోగం ఎవడో తీసేయడమేమిటి? నన్ను విడిచి వెళ్ళిన రవిబాబు కన్నా ఆ బోడి ఉద్యోగం ఎక్కువా? కోపంతో రాజీనామా చేసేయడానికి సిద్ధపడ్డాను.కాని లక్ష్మి వారించింది. నన్ను చల్లబరిచి మళ్ళీ నేను ఉద్యోగానికి వెళ్ళేటట్టు చేసింది.

అదే ఉద్యోగం మళ్ళీ నన్ను మనిషిని చేసింది.

నన్ను డిపార్టుమెంట్ మార్చారు. అక్కడ పని ఒత్తిడి ఎక్కువ.

పనిలో టెన్షన్ ఎక్కువ కావడంతో మరొక ఆలోచనకి అవకాశం ఉండేది కాదు. ఉదయం ఎనిమిది గంటలకి ఆఫీసుకి వెళితే మళ్ళీ ఏ రాత్రో ఇంటికి చేరేవాడిని.

నా లక్ష్మి కూడా నన్ను ప్రేమగా చూసుకునేది. కొడుకు ధ్యాస నాలో తలెత్తకుండా జాగర్త పడేది. అయితే ఆమె గుండెల్లో ఎన్నో దుఃఖ భాండాలు. వంటరిగా ఉన్నప్పుడు అవి బద్దలయి కడుపు చెరువయ్యేది. గుండెలు బాదుకుంటూ భోరున విలపించేది. ఆ విషయం నాకు తెలుసు.

విధి నాపై పగ విడిచి పెట్టలేదు:

వరుసగా పిడుగుల వర్షం.

ఉద్యోగం నుంచి రిటైర్‌మెంట్.

రిటైర్‌మెంట్‌కి ఆర్నెల్లు ముందు నా భార్య చనిపోయింది.

నా భార్య పోవడానికి ఆర్నెలు ముందు నాకు గుండె జబ్బు వచ్చింది.

ఆమె కన్నా ముందు నేనే పోతాననుకున్నాను. గుండె జబ్బు అంత కుదుపు కుదిపేసింది. ఆమె నన్ను చావనీయకుండా సకాలంలో ఆసుపత్రికి తీసుకువెళ్ళి, నాకు సపర్యలు చేసి, నన్ను బతికించి, రవిబాబు గత స్మృతులన్నీ జాగర్తగా నాకు మూటకట్టి ఇచ్చేసి - నాకు చెప్పా చేయకుండా ఈ లోకం నుంచి వెళ్ళిపోయింది. అయినా -

నేను ఆమెకి శాస్త్రోక్తంగా అంత్యక్రియలు జరిపి ఆమె ఆత్మకు శాంతి చేకూర్చేను.

మరి నా సంగతి ఏమిటి?

నేను దిక్కుమాలిన చావు చావాల్సిందేనా? రేపు నేను గుండె ఆగి గుటుక్ మంటే నా స్థితి ఏమిటి? నా శరీరం పురుగులు పట్టి, దుర్వాసన కొట్టి - ఇరుగు పొరుగు ముక్కు మూసుకొని నా శవాన్ని మున్సిపాలిటీ వాళ్ళచేత ఎత్తించేస్తారు. వద్దు... వద్దు.. నాకా చావు వద్దు.

నాకు కర్మపై నమ్మకుముంది. నాకు తల కొరివి పెట్టడానికి బంధువులు కూడా లేరు. ఆ బాధ్యత ఒక్క నా కొడుకు పైనే ఉంది. వాడు నన్ను కాదని పోయినా ఎందుకో వాడు

నాకు దక్కుతాడని నాలో ఏదో... ఆశ.

తుది క్షణంలోనైనా వాడిని చూడకుండా ఈ ప్రాణం పోదు. వాడి చేతుల్లోనే నేను చచ్చిపోతాను.

వాడు నా కోసం వస్తాడు. లేకుంటే నేనే వాడి దగ్గరకు వెళ్తాను.

గత రెండేళ్ళుగా వాడిని వెదికే ప్రయత్నంలో ఉన్నాను. అదే నా ఉద్యోగం. అదే నా ఉద్యమం.

ఆనాడు రవిబాబుకి చెందిన వ్యక్తులను కోపంతో ఎవరినీ ఇంటి గుమ్మం ఎక్కనీయలేదు. అప్పుడు పోలీసు వేధింపులూ అలానే ఉండేవి. ఇన్నాళ్ళ తర్వాత - ఇప్పుడు ఎక్కడికి వెళ్ళాలో తెలీదు... ఎవర్ని అడగాలి? ఏ అడవులు వెదకాలి?

అప్పటికీ అడగగలవారినందరినీ అడిగాను. ఈ వయసులో తిరగరాని చోటల్లా తిరిగాను. అలా తిరుగుతుంటే ఎవరో అన్నారు - రవిబాబు అడవిలో లేడు. మైదానంలోనే ఉన్నాడని. అలాగే మరొకరెవరో అన్నారు - వైజాగ్‌లో చూడండి, దొరుకుతాడని.

అది చివరికి నిజమే అయింది.

గత మూడు నెలలుగా చిన్న ఇల్లు అద్దెకి తీసుకొని, వాడిని వెదికే వేటలో పడ్డాను. నా వేట ఫలించింది. నా బాబు నాకు దక్కేడు. మృతవీరుల స్మారక సభలో చిక్కేడు.

చిక్కినట్టు చిక్కి... నేనెవరో వాడికి తెలీనట్టు నాటకమాడుతున్నాడు.

వార్ధక్యం ముంచుకొచ్చి వాడు గుర్తించలేనంతగా మారిపోయానా? వాడిని నేను గుర్తించగా లేనిది వాడు నన్ను గుర్తు పట్టలేడా?

వాడిదంతా నాటకం. మళ్ళీ తండ్రి ఉచ్చులో చిక్కుకుంటే వాడి లక్ష్యం నెరవేరదు. వాడిలో ప్రవహిస్తున్నది నా రక్తం కాదు. విప్లవం. విప్లవం.

ఎవరో తలుపు తడుతున్నట్టు చప్పుడు.

ఎవరో కాదు. నా రవిబాబే! నాటకం కొనసాగించడం వాడి తరమా?!

వెళ్ళి తలుపు తీశాను.

ఎవరూ లేరు!

అంతా భ్రమ.

నవ్వుకున్నాను. కాదు -

బిగ్గరగా నవ్వేను. నా నవ్వు ఏడుపుగా మారేవరకూ... నవ్వుతూనే వున్నాను.

నెమ్మదిగా మంచం పైకి చేరి దుప్పటి కప్పుకున్నాను.

తలుపు చప్పుడు అంటే... ఎందుకో అప్పటి సంఘటన గుర్తుకొచ్చింది.

రవిబాబుకి అప్పుడు తొమ్మిదేళ్ళు.

ఆ రోజు రాత్రి ఎందుకనో ఇంటికి ఆలస్యంగా చేరాను నేను. రవిబాబు వాడి గదిలో నిద్రపోతున్నాడు. లక్ష్మి నిద్రపోకుండా, భోజనం చేయకుండా నా కోసం ఎదురు చూస్తోంది.

భోజనం ముగించి ఇద్దరమూ బెడ్‌రూం చేరేం. బెడ్‌రూం లోన గడియ వేశాం.

దబ దబ తలుపు చప్పుడు. తలుపు గట్టిగా తట్టుతూ నన్ను పదే పదే పిలుస్తున్నాడు రవిబాబు.

వెంటనే తలుపు తెరిచే స్థితిలో లేము.

మంచం మీంచి లేచి, విడిచిన బట్టలు కట్టుకున్నాం.

రవిబాబు ఆగకుండా తలుపు తడుతూనే ఉన్నాడు - నేను వెళ్ళి తెరిచేవరకు.

"ఏమయింది బాబు?"

వాడు ఏడుస్తూ నా వైపు కోపంగా చూస్తున్నాడు.

నాకు అర్థమయింది. వాడిని దగ్గరగా తీసుకొని బుజ్జగించి నా పక్క మీదకు చేరాను. నన్ను వాడు గట్టిగా వాటేసుకు పడుకున్నాడు.

అంతవరకూ నిద్ర నటించిన లక్ష్మికి కోపం వచ్చింది.

"వాడిని గట్టిగా కౌగలించుకు పడుకోండి... పాలు కూడా పట్టండి" అంది.

లక్ష్మి కోపం నాకు అర్థమయింది.

రవిబాబు అప్పుడప్పుడు అలా వచ్చేస్తుంటాడు. వాడి సంగతి తెల్సి మేము బెడ్‌రూమ్ తలుపులు తెరిచే ఉంచుతాం. ఎప్పుడేనా... ఆ కాసేపు మాత్రమే తలుపులు మూసు కుంటాయి.

"తలుపులు ఎందుకు వేసుకున్నారు?"

వాడు అడిగింది నన్ను. సమాధానం చెప్పింది లక్ష్మి.

"బుద్ధి తక్కువయి" అంటూ మంచం మీంచి లేచి విస విస లాడుతూ డ్రాయింగ్ రూమ్‌లో సోఫా మీద పడుకుంది.

రవిబాబుని పడుకోబెట్టి నెమ్మదిగా లక్ష్మి దగ్గరకు వెళ్ళేను. తను ఇంకా విస విస లాడుతూనే ఉంది. ఆమెను ప్రసన్నం చేసుకొని నిద్రపోయేటప్పటికి గంట పట్టింది.

నవ్వుకున్నాను.

రవిబాబు రోజూ పడుకోబోయే ముందు నా పక్కలోకి చేరి కబుర్లు చెబుతాడు. చెప్పించుకుంటాడు. వాడి యక్ష ప్రశ్నలకి విసుగు చూపకుండా సమాధానం చెప్పాలి. సముదాయించాలి. తర్వాత నేనే వాడిని వాడి గదిలోకి తీసుకువెళ్లి మంచంపై పడుకోబెట్టి, దుప్పటి కప్పి - బుగ్గపైన, నుదిటిపైన ముద్దులు పెడితేగాని నన్ను వదలడు. వాడు నిద్రపోడు.

ఏ రోజైనా ఇంటికి ఆలస్యంగా చేరితే ఇలాగే గొడవ చేసేవాడు. అయితే వాడికి నూనూగు మీసం, బొంగురు గొంతు వచ్చేక - ఎప్పుడు పడితే అప్పుడు మా బెడ్‌రూమ్‌కి రావడం మానుకున్నాడు.

మళ్ళీ పదేళ్ళకి కనిపించేడు. కనిపించినట్టు కనిపించి దాగుడు మూతలు ఆడుతున్నాడు. నా రవిబాబు కానట్టే ప్రవర్తిస్తున్నాడు. నాకెలా నిద్ర పడుతుంది?

నన్నిలా క్షోభకి గురిచేసి వాడు మాత్రం నిద్ర పోగల్గుతున్నాడా?

నిద్రపోలేడని నాకు తెలుసు.

మళ్ళీ తలుపు చప్పుడు.

మంచం మీంచి లేచి, పంచె సరిగా చుట్టుకొని, అర నిముషంలో తలుపు తీసేను.

లేడు వాడు.

అంతా నా భ్రమ కింద కొట్టి పారేయలేకపోతున్నాను.

తలుపు తట్టి... ముఖం చెల్లక... పారిపోయి ఉంటాడు.

ఏమైనా వాడి ప్రవర్తన నాకు నచ్చలేదు.

నాలో నేను ఎంతో మథనపడి చివరికి ఆ రాత్రి నేనొక నిర్ణయం గట్టిగా తీసుకున్నాను.

'ఒరే! కనిపించినట్టు కనిపించి ఏమీ ఎరగనట్టు – ఈ ముసలి తండ్రిని ఇంకా ఎందుకురా దుఃఖపెడతావ్.. నేను ఏం పాపం చేశానని ఇలా ఏడిపిస్తున్నావ్' అని వాడిని నిలదీసి అడగను. ఏడ్వను. ఏదో ఒక రోజు – 'నన్ను క్షమించు నాన్నా' అని వాడే నా కాళ్ళపై పడేటట్టు చేస్తాను.

ఇన్నాళ్ళూ నన్ను వాడు హింసించేడు.

ఇప్పుడు నేను వాడిని హింసిస్తాను.

హింసకి హింసే మందు.

ఆ మరుచటి రోజు నుంచీ.. వారం రోజుల వరకూ వాడిని వదల్లేదు.

వాడి నీడలా వాడితోనే ఉన్నాను.

రవిబాబు ఉన్న ఇల్లు పగలంతా తాళం వేసి ఉండేది. వాడు సాయంత్రం ఏ ఆరింటికో యింటికి వచ్చేవాడు. అప్పటికే నేను ఆ యింటి ఎదురుగా ఉన్న మదుంపై కూర్చొని ఉండేవాడిని.

వాడు నన్ను చూసి కంగారుపడేవాడు. ఆ కంగారు చూసి గర్వంగా నవ్వుకునేవాడిని.

సాయంత్రాలు నన్ను భరించలేక ఒక్కోసారి ఇంటికి తాళం వేసుకొని బయటకెళ్ళిపోయే వాడు. అప్పుడూ నేను వాడిని వదిలేవాడిని కాను. వెనుకనే ఫాలో అయ్యేవాడిని.

ఆ వయసులో నిరీక్షణ, నడక ఇబ్బంది కలిగించినా నేను పట్టించుకోలేదు. వాడిని జయించడమే నా లక్ష్యం. ధ్యేయం.

ఒక రోజు.. వాడేదో చచ్చు పుచ్చు సినిమాకి వెళ్ళేడు. నేనూ వెళ్ళేను. వాడు ఎక్కడుంటే అక్కడే... నాలానే సినిమాని భరించలేకపోయేదులా ఉంది. ఇంటర్‌వెల్ తర్వాత బయటకు వచ్చేవాడు.

ఎక్కడెక్కడో తిరిగి తిరిగి ఇంటికి చేరేసరికి రాత్రి తొమ్మిదయింది. అంతసేపూ నేను వాడిని వెంటాడుతూనే ఉన్నాను.

వెంటాడుతున్నానన్న సంగతి వాడికి తెలుసు.

వాడు ఇల్లు చేరేక – నేను అలవాటుగా కూర్చునే ఆ మదుం మీద స్థిరపడబోతుంటే – వాడు ఇక ఉండలేక నా దగ్గరకు వచ్చేడు.

"ఎవరు మీరు? ఎందుకు నన్ను వెంబడిస్తున్నారు?" అనడిగేడు.

నాకు నవ్వు వచ్చింది.

"ఎవర్ని ఎవరు వెంబడిస్తున్నారు? రక్తాన్ని రక్తమే వెంబడిస్తుంది. రక్తానికి ఉన్న శక్తి నీకు తెలీదా రవిబాబు"

"నా పేరు రవిబాబు కాదు భాస్కర్"

"ఇద్దరూ ఒక్కరే!"

"కాదు"

"కాదంటే కాకుండా పోతావా? నీవు నీవె!"

"మీరేమిటంటున్నారో నాకు అర్థం కావడం లేదు"

"నేను నీకు అర్థం కావడం లేదా? ఏదీ నా కళ్ళలోకి సూటిగా చూసి చెప్పు"

"మీరు పోలీసు కాదు. నాకు తెలుసు. మిమ్మల్ని చూస్తుంటే ఏదో పోగొట్టుకున్నట్టు కనిపిస్తున్నారు. నేను చేయగల సాయం ఏదైనా వుంటే చెప్పండి చేస్తాను"

నా కళ్ళల్లో నీళ్ళు తిరిగేయి.

"నేను మాత్రమేనా పోగొట్టుకున్నది? నీవు కాదా?"

"మీ మనసు సరిగా ఉన్నట్టు లేదు. పెద్దవారు. మంచులో అలా మదుంపై కూర్చోకండి. సుస్తీ చేస్తుంది. ఇంటికి వెళ్ళిపోండి."

నా సమాధానం కోసం ఎదురు చూడకుండా - రోడ్డుపై వెళ్తున్న ఆటోని పిలిచేడు.

ఆటో నన్ను వాడి నుంచి దూరంగా తీసుకుపోయింది. కర్కశంగా ఈడ్చుకు పోయింది.

నేను దూరంగా ఉంటే వాడు ఎంతైన కఠినంగా ఉండగలడు. అదే నేను ఎదురైతే ఆ బండ గుండె రాయి కదిలిపోతోంది. కరిగిపోతోంది. తను ఓడిపోతున్నాడు. తట్టుకోలేక పోతున్నాడు... 'ఒరే నేను వదలనురా. నీవు నన్ను తండ్రిగా గుర్తించే వరకూ, అంగీకరించే వరకూ వదలనురా'

మరుచటి రోజు మళ్ళీ మదుం దగ్గర హాజరయ్యేను. అయితే -

నా రవిబాబు సాయంత్రం రాలేదు. రాత్రి ఏడు.. ఎనిమిది... పది... పన్నెండు.

రాలేదు వాడు.

తెల్లవారిందాక అక్కడే అలా ఉండిపోయేను.

ఏమయింది నా కొడుక్కి?

నన్ను భరించలేక ఏ మిత్రుడి ఇంట్లోనో ఉండిపోయేడా? లేకుంటే రాత్రికి రాత్రి నా పీడ వదుల్చుకోవడానికి ఇల్లు మారిపోయేడా?

విపరీతమైన గుండె నొప్పి వచ్చింది నాకు. చచ్చిపోతానేమోనని భయం వేసింది. నేను చచ్చిపోవడానికి వీలులేదు. నా రవిబాబు నన్ను వాడి చేతుల్లోకి తీసుకున్న తర్వాత - నేను ఏమైనా ఫర్వాలేదు.

నేను అలా నొప్పితోనే డాక్టరు దగ్గరకు పరిగెట్టేను.

డాక్టర్ ఇంజక్షన్ ఇచ్చేడు.

"మీరు ఆందోళనగా కనిపిస్తున్నారు. మీరు మనసు దిట్టం చేసుకొని విశ్రాంతి తీసుకోండి. ఇంటి దగ్గర ప్రశాంతత కుదరదనుకుంటే మా నర్సింగ్ హోమ్‌లో రెండు రోజులు రెస్టు తీసుకోండి" అన్నాడు డాక్టర్.

డాక్టరు ఎంత చెబుతున్నా వినిపించుకోకుండా రవిబాబు ఇంటికి పరిగెట్టేను.

లేడు వాడు. ఆ రోజు... మరుచటి రోజు కూడా రవిబాబు జాడ లేదు.

మళ్ళీ తుపాకితో అడవుల్లోకి పోయేడా?

కడుపులో పేగు కదిలింది.

ఊరంతా పిచ్చిగా ఆటోలో తిరిగాను. రాత్రల్లా వాడి ఇంటి ముందు జాగరం చేసాను. ఆ యింటికి యిరుగూ, పొరుగూ లేదు. ఎవర్ని అడగాలో తెలీదు. పిచ్చెక్కిపోయింది నాకు.

ఇంట్లో దేవుడి పటాలన్నీ నేలకేసి కొట్టాను. ఇంట్లో సామానంతా ధ్వంసం చేసి చిందర వందర చేసాను.

నా జన్మలో యింత క్షోభకీ, యింతటి అశాంతికీ ఏనాడూ గురికాలేదు.

నా ఇల్లు ధ్వంసం చేసి - వాడి ఇంటి గుమ్మం ముందు పడిపోయేను. సొమ్మసిల్లి పడిపోయేను.

ఎవరో నన్ను తట్టి లేపాడు.

"ఎవరు కావాలండీ మీకు?" అనడిగేడు.

రవిబాబు కావాలన్నాను. అతనికి అర్థం కాలేదు.

రవిబాబు లోకాన్ని మభ్యపెట్టడానికి పెట్టుకున్న పేరు భాస్కర్.

"భాస్కర్ ఎక్కడున్నాడో తెల్సా బాబు"

అతడెవరో పుణ్యాత్ముడు. మానవ రూపంలో వచ్చిన భగవంతుడు.

"రండి" - అంతకన్నా ఎక్కువ మాట్లాడలేదు.

నన్ను రవిబాబు వద్దకు తీసుకువెళ్ళేడు.

అది పెద్దాసుపత్రి. నా గుండెలు గుభేలుమన్నాయి.

రవిబాబు తలకి పెద్ద కట్టు వుంది. ఎడమ చేతికీ, ఎడమ కాలుకీ పిండికట్టు ఉంది.

ఏమైంది నా బాబుకీ?

ఆక్సిడెంట్!

లారీ గుద్దేసిందట. ఒక రోజంతా అపస్మారక స్థితిలో ఉండి ప్రమాదం నుంచి బయటపడ్డాడట.

గుండెలు బాదుకున్నాను. ఎంత ఘోరం జరిగిపోయింది.

ఎగతన్నుకొస్తున్న దుఃఖాన్ని దిగమింగుకోలేకపోయేను.

నేను వెళ్ళేటప్పటికి రవిబాబు నిద్రపోతున్నాడు.

నిద్రపోతున్న రవిబాబుని చూస్తుంటే... బాల్యంలో పదేళ్ళ రవిబాబు గుర్తుకొచ్చేడు.

వాడి పక్కనే పడుకొని సేద తీర్చాలనిపించింది. గుండెలకి హత్తుకొని ఓదార్చాలని

పించింది. వాడి స్నేహితులు అక్కడ లేకుంటే నేను అంత పనే చేద్దును.

వాడి స్నేహితులూ మంచివాళ్ళే! నేను రాగానే నాకు కూర్చొడానికి చిన్న బల్ల ఇచ్చేరు. నేను కూర్చొని రవిబాబు వైపు తదేకంగా చూస్తున్నాను.

కాసేపటికి... నా బాబు కళ్ళు తెరిచేడు.

అంతమందిలోను అందర్నీ కాదని... నన్నే.. కేవలం నన్నే చూసేడు. విస్తుపోతూ చూసేడు.

నెమ్మదిగా చేతులెత్తి నమస్కరించేడు.

నాకు కన్నీళ్ళు ఆగలేదు.

నా బాబుకి స్నేహితులు తప్ప ఎవరూ లేరా!

నాకు నవ్వు వచ్చింది. ఎవరూ లేకపోవడం ఏమిటి?

నేనున్నాను. నేనుండగా వాడికి లోటేమిటి?

ఆ రోజు నుంచి నేను అక్కడే వున్నాను. రవిబాబుకి అవసరమైన సపర్యలు చేస్తూ అక్కడే ఉన్నాను. నేను రవిబాబుని కంటికి రెప్పలా సాకుతుండడంతో వాడి మిత్రులు వాడి బాధ్యత నాకు వదిలేసారు. అప్పుడప్పుడు వచ్చిపోతుండేవాళ్ళు.

ఒకరోజు రవిబాబు నన్ను గుండెల్ని పిండే మాట అన్నాడు.

"మీరు నా కెందుకు ఇంత సేవ చేస్తున్నారు. మీ పేరేమిటి?"

నాకు ఏడుపొచ్చింది. తలకి దెబ్బ తగిలి మతి భ్రమించిందా!

"ఇది సేవ కాదు. నా పేరు తండ్రి"

"తండ్రా!... అది కాదు. మీ పేరు చెప్పండి. మిమ్మల్ని నేను ఏమని పిలవాలి?"

"ఒరే! రవిబాబు! ఇంకా నాటకమేనా! నీవెంత కఠినుడివిరా. కాకుంటే నీకు నిజంగానే మతి భ్రమించి ఉండాలి.

"తండ్రిని ఏమని పిలుస్తారు బాబు" అన్నాను.

"..నాన్న"

నా ఆనందం అంతా ఇంతా కాదు. నా బలహీనమైన గుండె ఉక్కుముక్కగా మారి... గుడి గంటలా మ్రోగింది. ఆ పిలుపు నన్ను ఏవేవో దివ్యలోకాల్లోకి తీసుకుపోయింది.

"ఏది బాబూ! మరొక్కసారి.... మరొక్కసారి.. పిలు – నీ వలా పిలుస్తుంటే వేయేనుగుల బలం ఈ గుండెకు వస్తోంది బాబు. నిజం బాబు. ఏదీ... పిలు.. పిలు... నా బాబువి కదూ ఒక్కసారి పిలు"

ఆ ఉద్వేగంతో ఒక్కసారి కాదు.. వందసార్లు 'నాన్నా' అని పిలిపించుకున్నాను.

తర్వాత నన్ను అలానే పిలవసాగేడు.

రవిబాబుకీ నేను మాత్రమే ఉన్నాననుకున్నాను.

కాని ఆసుపత్రికి పరుగున వచ్చేరు ఒక స్త్రీ, ఒక బాలుడు.

నాకు తెలియకుండా వాడి జీవితంలోకి ప్రవేశించిన ఇద్దరు వ్యక్తులు – కోడలు, మనవడు.

వాళ్ళిద్దర్నీ పరిచయం చేశాడు.

కోడలు పిల్ల బాగుంది. పేరు అరుణ.

మనవడికి ఏడెనిమిదేళ్ళు ఉంటాయి. అచ్చు రవిబాబు అలానే ఉండేవాడు ఆ వయసులో.

"నీ పేరేమిటి? మనవడా!"

"కిరణ్! రవికిరణ్."

ఆ పేరు నా గుండె తంత్రులను మీటి .. ఏదో హాయి నా శరీరమంతా వ్యాపింపచేసింది.

నా కొడుకు రవిబాబు.

రవిబాబు కొడుకు రవికిరణ్.

ఆ రవి కిరణాలు నన్ను నులివెచ్చగా తాకి పులకింపచేస్తున్నాయి.

ఎంతో అప్యాయంగా మనవణ్ణి ఎత్తుకొని ముద్దు పెట్టుకున్నాను.

తాతకి శక్తినిచ్చేది, తృప్తినిచ్చేది మనవడే అనేది ఆ క్షణం అనుభవమయ్యింది.

నా గుండెపై ఇప్పుడు వేయి ఏనుగులు నడిచినా ఏమీ కాదు. నా గుండె నిపుడు డాక్టరు పరీక్షిస్తే ఆ డాక్టరే గుండాగి చస్తాడు. అది ఖాయం.

ఆసుపత్రిలో నెల రోజులు పైగా ఉండాల్సి వచ్చింది.

కోడలు అరుణా, మనవడు కిరణ్ నాకు మరింత చేరువయ్యేరు.

కోడలు ద్వారా నాకు తెలిసిన కొన్ని విషయాలు -

రవిబాబు (ఆమె కూడా భాస్కర్ అంది) ఫుల్‌టైమ్ పార్టీ వర్కరట. ఏ పార్టీ అని నేను అడగలేదు. నాకు తెలుసు కదా! ఆ పార్టీని పటిష్టం చేయడమే అతని ఉద్యోగం. లక్ష్యం. ఆశయం. పార్టీయే అతని ప్రపంచమట.

అరుణ హైదరాబాద్‌లో గవర్నమెంటు కాలేజీలో లెక్చరర్‌గా ఉద్యోగం చేస్తోందిట. ఆమె కుటుంబమంతా కమ్యూనిస్టులేనట. ఆమె తండ్రిని ఎన్‌కౌంటర్ పేరుతో పోలీసులు చంపివేశారట. తండ్రి పోయినా తను ఏకాకి కాలేదట - రవిబాబు స్నేహం వల్ల. రవిబాబు స్నేహం ప్రేమగా ఫరిఢవిల్లిందట. 'పెళ్ళి' అంటూ ప్రత్యేకంగా చేసుకోకపోయినా భార్యభర్తలుగా ఉంటున్నారట. రవికిరణ్‌తో సంతానం చాలు అనుకున్నారట.

హైదరాబాద్ నుంచి రవిబాబు పార్టీ పని మీద వైజాగ్ ఆరు నెలల క్రితమే వచ్చేడట. మరి కొంతకాలం ఇక్కడే ఉండి పార్టీని పటిష్టం చేయాలని హైకమాండ్ ఆర్డరట. ఆమె అప్పుడప్పుడు హైదరాబాద్ నుంచి వచ్చి రెండ్రోజులుండి పోతున్నదట.

ఆమె కథ విన్నాక - నేను రవిబాబు తండ్రినయినందుకు నా మనసెందుకో గర్వించింది.

నా విషయాలు తెలుసుకోవడానికి కోడలు ప్రయత్నించలేదు. వాళ్ళు నాటకం తెర దించేవరకు నేను ఏమీ చెప్పదల్చుకోలేదు. చెప్పలేదు.

అయితే వాడు నా గురించి ఏమి చెప్పాడో తెలీదు. నన్ను వాళ్ళలో ఒకడిలాగే చూసుకునేవాళ్ళు.

వాళ్ళ సహచర్యం వల్ల వాళ్ళ మాటలు, వాళ్ళ స్నేహితులు కబుర్లు వినడం వల్ల, వాళ్ళిచ్చే చిన్న చిన్న పుస్తకాలు చదవడం వల్ల... నాలో... నా భావాల్లో అనూహ్యమైన

పెనుమార్పు వచ్చింది - నెల గడిచేసరికి.

రవిబాబుకి పూర్తిగా నయమయింది.

ఆసుపత్రి నుంచి డిశ్చార్జి చేశారు.

రవిబాబు నా కాళ్లకు నమస్కరించి అన్నాడు -

"మీకు ఋణపడి ఉన్నాను, మీ ఋణం ఎలా తీర్చుకోను?"

'నాన్నా అని పిలుస్తూ ఋణం అంటావేమి'టని చీవాట్లు వేశాను - "అయినా కొడుకుగా తండ్రి ఋణం తీర్చాల్సింది ఒకటుంది" అన్నాను.

అదేమిటో చెప్పమన్నాడు.

సమయం వచ్చినప్పుడు చెబుతానన్నాను.

తప్పకుండా చెప్పాలన్నాడు.

అయితే -

చెప్పాల్సిన సమయం అంత ఉరుకుల పరుగులతో నాపై జాగిలంలా పడిపోతుందను కోలేదు. రంపం లాంటి పదునైన పళ్ళతో నా శరీరాన్ని చింపిరి గుడ్డలా చించేసి నా గుండెకాయని అందుకోవాలని చూస్తోంది మృత్యువు.

నా కొడుకుని చూసుకున్నాక నా గుండె మొండిది. నూరేళ్ళు బతికేస్తాననుకున్నాను. కాని ఒక్కసారిగా వళ్ళంతా చెమట్లు పట్టేశాయి. కళ్ళు బైర్లు కమ్మేశాయి.

తర్వాత ఏమైందీ నాకు తెలియదు.

నాకు తెలివి వచ్చేటప్పటికి భాస్కర్ ఇంట్లో ఉన్నాను - కాదు, కాదు రవిబాబు వడిలో ఉన్నాను.

వాడు నా వయిపు ఆందోళనగా చూస్తున్నాడు.

నాకు పరమానందంగా ఉంది. నా గుండె నొప్పిని అణిచేసి - నా మనసు ఉవ్వెత్తున మహా సంతోష తరంగాల్లో సయ్యాటలాడుతోంది. నా జన్మ ధన్యమైనట్టు అనిపించింది.

నేను ఇలా నా కొడుకు వడిలో చచ్చిపోవాలి. నేను కోరుకున్నదదే!

అందుకే రవిబాబు డాక్టరు దగ్గరకు వెళ్దామంటే వద్దని వారించేను.

నా పక్కనే కోడలు, మనవడూ ఉన్నారు.

నేను నెమ్మదిగా లేచి కూర్చోగలను. కాని నాకు కూర్చోవలనిపించలేదు. బాబు వడిలోంచి లేవాలనిపించలేదు.

నాకు చావు అసన్నమయిందని...అది కొన్ని క్షణాల్లో, గంటల్లో, కావచ్చని నాకు స్పష్టంగా తెలుస్తోంది.

"బాబూ"

"ఏమటండీ"

"అయ్యో! నీకెన్నిసార్లు చెప్పేది నాన్నా అనలేవా"

"నాన్న... గారూ"

ఉప్పెనలా తన్నుకొచ్చిన ఆనందంతో బలహీనమైన గుండెను తట్టుకోవడం మరీ కష్టమయింది.

"బాబూ... నేను ఏ క్షణంలోనైనా చచ్చిపోక తప్పదు. నీవు నా ఋణం తీర్చుకోవాల్సిన సమయం ఆసన్నమయింది"

"చెప్పండి.. నాన్నగారూ"

"నీవు నా కొడుకువన్న సంగతి గుర్తుంచుకొని కమ్యూనిస్టువన్న సంగతి మర్చిపోవాలి"

కాసేపు ఆగి - 'అలాగే' అన్నాడు.

"నేనిక మృత్యువులో పోరాడలేను. అయిపోయింది నా పని. క్షణమో, అర క్షణమో ఈ గుండె ఆగిపోతుంది. నేను చనిపోయేక ఈ శరీరానికి శాస్త్రోక్తంగా నీవు దహన సంస్కరణ చేయాలి. నాకు తలకొరివి పెట్టి కర్మ చేయాలి. నా ఆత్మను సంతోషంగా మీ అమ్మ దగ్గరకు సాగనంపాలి. ఇది నా కోరిక కాదు. నీ బాధ్యత."

రవిబాబు అలా వుండిపోయేడు. ఏమీ మాట్లాడలేదు.

రవిబాబు ముఖంలో మారుతున్న రంగులు చూస్తుంటే - కాదంటాడనే భయం వేసింది. ఏదో చెప్పబోతున్నాడు -

అంతలో -

ఇనుప బూట్లు కిరాతకంగా చప్పుడు చేస్తూ ఆ గదిలోకి ప్రవేశించాయి.

ఆ వెంటనే రవిబాబుని నా నుంచి బలవంతంగా లాగి అరెస్టు చేశాయి.

"నా రవిబాబుని ఎందుకు అరెస్టు చేస్తున్నారు?"

"నీకెందుకు తెలీదురా ముసలాడా! వీడిని పట్టించింది నీవే. నీవు నీ కొడుకుని ఫాలో అయితే - మేము నిన్ను ఫాలో అయ్యేం. అర్థమయిందా? ఎన్నో కుట్ర కేసులు, మరెన్నో హత్యలతో సంబంధమున్న నీ కొడుకు కరడు కట్టిన నక్సలైట్ నాయకుడని నీకు తెలీదా. మాకు దొరకడానికి వీలులేకుండా ఫోటో దగ్గర్నుంచి సమస్తం, అన్నింటిలో జాగర్త పడినా.. ఇదిగో, సెంటుమెంటు దగ్గర పప్పులో కాలేస్సేడు నీ కొడుకు. ఇప్పుడర్థమయిందా. మరిక నోర్మూస్కో" అన్నాడు. పోలీసు తాగి ఉన్నట్టున్నాడు.

రవిబాబు పోలీసులతో అన్నాడు - "మీరు పొరబడుతున్నారు. నేను రవిబాబుని కాదు. నా పేరు భాస్కర్. ఆ వృద్ధుడు ఎవరో కూడా ఇంత కాలం నాకు తెలీదు. ఇప్పుడే మీ దయ వల్ల తెలిసింది. వారు నన్ను వెంబడిస్తుంటే ఎవరో కొడుకుని కోల్పోయి.. ఆ షాక్‌లో మతి భ్రమించి తిరుగుతున్న ఒక సామాన్య తండ్రి అనుకున్నాను గాని - ఆ విప్లవ నేత తండ్రి అనుకోలేదు. ఎంచేతో కొడుకు మీద భ్రమతో వారు నన్ను రవిబాబు ననుకోవచ్చు. కాని ఆవలిస్తే పేగులు లెక్కపెట్టే మీరు - ఇంత చవగ్గా భ్రమ పడకూడదు. నన్ను రవిబాబుగా భావించి అరెస్టు చేస్తున్నారంటే .. మీకు కూడా వార్ధక్య లక్షణాలు, మతి చాంచల్యం-"

లాఠీ దెబ్బలు - "ఏం కూసావురా గాడిద కొడకా!" అంటూ - రవిబాబుపై బలంగా పడ్డాయి. 'హరి కథలు వినిపిస్తే నమ్మేస్తామనుకుంటూన్నవా' అంటూ బాదేరు. బాదుతూ

పోలీసులు ఈడ్చుకుపోతున్నారు.

'ఒక్క నిముషం' అని ఖాకీలను రిక్వెస్టు చేశాడు.

ఎంచేతో వాళ్ళు ఒప్పుకున్నారు.

తను అరుణ దగ్గరకు వెళ్ళి – "భయపడకు. నేను కామ్రేడ్ రవిబాబుని కాదని నీకు తెలుసు. తిరిగి వస్తాను. రాకపోయినా భయపడకు. భయపడవని నాకు తెలుసు. త్యాగాలు చేసే విప్లవ కుటుంబం మీది... బాబుని జాగర్తగా చూసుకో. రవిబాబు తండ్రిగారికి కావాల్సిన ఏర్పాట్లన్నీ చూడు" అన్నాడు.

కొడుకు రవికిరణ్‌ని ముద్దు పెట్టుకున్నాడు.

నా వద్దకు వచ్చి నమస్కారం పెట్టేడు. – "క్షమించండి. నేను నిజంగా మీ కొడుకుని కాదు. కాదన్నా మీరు ఒప్పుకోలేదు. అయితే మీరు నన్ను కొడుకుగా భావించడం నా అదృష్టం. తిరిగి వస్తాను. నేను రాలేకపోతే నా కొడుకు ఉన్నాడు. మనవడు తల కొరివి పెట్టడానికి అర్హుడే కదా?" – చిన్నగా నవ్వి రవికిరణ్ చేతిని నా చేతిలో పెట్టేడు.

"ఒక్కమాట, మీ కుమారుడు రవిబాబు గొప్ప విప్లవకారుడు. మీకు దూరమయి మీ మనస్సుని క్షోభపెట్టేడనీ, చివరికి మీరు తనువు చాలిస్తే అంత్యక్రియలు జరపడానికి లేకపోయేడని బాధపడకండి. అది చిన్న విషయం. మీ కొడుకు సామాన్యుడు కాదు. పీడిత ప్రజల విముక్తి కోసం పోరాటం సాగిస్తున్నాడు. ఈ కుళ్ళిన వ్యవస్థకి సమూలంగా అంత్యక్రియలు జరపడానికి మహాయజ్ఞంలో నిమగ్నమయి ఉన్నాడు. అంతటి గొప్ప కొడుకుని కన్నందుకు గర్వించండి" అంటూ –

ఆవేశంగా పిడికిలి బిగించి – "కామ్రేడ్ రవిబాబు జిందాబాద్' అన్నాడు.

కోరస్. అతనితో గొంతు కలిపేరు – అరుణ, పసివాడు కిరణ్.

ఆ వెంటనే 'విప్లవం వర్ధిల్లాలి' అంటూ మూడు గొంతుకలూ నినదించేయి. ఆ నినాదాల ప్రతిధ్వనులతో ఆ గది దద్దరిల్లిపోయింది. ఎనభై కోట్ల మంది కోరస్‌లా ఉంది. ఆ నినాదాల హోరుకి భూమి బద్దలైపోతున్నట్టు, కొండలు పగులుతున్నట్టు, ఆకాశం ముక్కలయి పడిపోతున్నట్టు నాకు అనిపించింది.

భాస్కర్‌ని నెట్టుకుంటూ, ఈడ్చుకుంటూ జీప్‌పై ఎక్కించుకొని తీసుకుపోతున్నా 'విప్లవం వర్ధిల్లాలి' అంటూ అతని గొంతు ప్రతిధ్వనిస్తూనే ఉంది. ఏదో శక్తి ఆవహించినట్టు అరుణ, రవికిరణ్‌ల స్వరాలు విప్లవాన్ని నినదిస్తూనే ఉన్నాయి.

నా అంతరంగంలో ఉద్రిక్తత. ఉద్వేగం.

రవిబాబు నా కొడుకు. భాస్కర్ నా కొడుకు. ఆదిభట్ల కైలాసం నా కొడుకు. వెంపటాపు సత్యం నా కొడుకు. సుబ్బారావు పాణిగ్రాహి నా కొడుకు. ఈ వ్యవస్థకి అంత్యక్రియలు జరపడానికి చితిని పేర్చే ఏ విప్లవకారుడైనా నా కుమారుడే! మొత్తం విప్లవకారులంతా నా కొడుకులే – అనిపించింది నాకు ఆ క్షణాన. అదే నా చి... వ....రి...క్ష...ణం. వి... ప్ల.....వం.... వ....ర్ధి.....ల్లా....లి.